ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
సోమవారం 16 సెప్టెంబరు 2024


పేషంట్‌తో ఆస్పత్రి ముందు గోడు వినిపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


వినాయకులను నిమజ్జనం చేయనున్న నెల్లుట్ల చెరువు

నెల్లుట్ల చెరువు వద్ద తెప్పను సిద్ధం చేస్తున్న సిబ్బంది

సర్వం సిద్ధం

- నేడు వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 200 మంది పోలీసులతో బందోబస్తు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 15: జిల్లాలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి రానుండగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. ఘనంగా నవరాత్రోత్సవాలను పూర్తి చేసుకొని ఈనెల 16న సోమవారం ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

ఏర్పాట్లు పూర్తి..

నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనోత్సవం ఎటువంటి అవరోధాలు లేకుండా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల చెరువులో అధికారికంగా నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. జనగామ - సూర్యాపేట రోడ్డులో ఫ్లై ఓవర్‌ను ఆనుకొని సర్వీసు రోడ్డు పక్కన ఉన్న చెరువుకు రోడ్డు ఏర్పాటు చేశారు. మొరం, కంకర పోసి రోలర్‌తో తొక్కిస్తూ రోడ్డును పటిష్టంగా నిర్మించారు. నిమజ్జనానికి తెప్పలను సిద్ధం చేశారు. మెయిన్ రోడ్డు నుంచి చెరువు నిమజ్జన కేంద్రం వరకు ఫ్లడ్‌లైట్లు సిద్ధం చేసి కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. నిమజ్జనం చేసేందుకు అధికారులు భారీ క్రేన్‌ను తెప్పించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. నిమజ్జనం చేసే స్థలాలకు చిన్న పిల్లలను తీసుకురావద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా స్టేషన్ ఘన్‌పూర్‌లో పుట్టలమ్మ కుంట వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా, పాలకుర్తి ఊర చెరువులో అధికారులు నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

భారీ భద్రత..

గణేష్ నిమజ్జనోత్సవానికి అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నెల్లుట్ల చెరువులో నిమజ్జనం చేసేందుకు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా నేతృత్వంలో ఏర్పాట్లను సిద్ధం చేశారు. సుమారు 400 విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారులు అంచనా వేయగా 200 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు నిమజ్జనాలు జరుగనున్నాయి.

మద్యం షాపుల బంద్..

నిమజ్జనం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు బంద్ ఉండనున్నాయి. ఈ మేరకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాలు జారీ చేశారు. గణేశ్ శోభాయాత్ర సందర్భంగా మద్యం సేవిస్తే ప్రమాదాలు, అల్లర్లు జరిగే అవకాశాలున్నాయని, వీటి నియంత్రణకు మద్యం షాపులను సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు మూసి ఉంచాలని ఆదేశించారు.

ఏర్పాట్లను పరిశీలించిన గణేష్ ఉత్సవ సమితి

నిమజ్జన కేంద్రమైన నెల్లుట్ల చెరువును గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ బృందం చేసిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, కార్యదర్శి రంగా నర్సింగరావు, ఉపాధ్యక్షుడు కీర్తి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న గణేష్ ఉత్సవ సమితి


చెరువు వద్దకు ఏర్పాటు చేసిన రోడ్డు

జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన రోగి.. చేర్చుకోకుండా వెళ్లగొట్టిన వైద్య సిబ్బంది

- ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు
- పోలీసుల జోక్యంతో అడ్మిట్ చేసుకుని పేషంట్‌కు చికిత్స

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 15: తీవ్ర జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ రోగిని వైద్య సిబ్బంది వెళ్లగొట్టారు. ఈ సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం... మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన ఇల్లెందుల కుమారస్వామి-ఫ్రాంక్లీన దంపతుల కుమార్తె ఖుషిప్రభకు శనివారం రాత్రి తీవ్ర జ్వరం వచ్చింది. జ్వరంతో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు శనివారం రాత్రి 2గంటలకు పట్టణంలోని ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో రాత్రి వేళలో ఉండే సిబ్బంది ఇక్కడ ఎవరూ లేరని బాధితులను వెళ్లగొట్టారు. చేసేదేమి లేక తీవ్ర జ్వరంతో ఉన్న బాలికను తీసుకొని తల్లిదండ్రులు ఇంటికి వెళ్లిపోయారు. తిరిగి ఆదివారం ఉదయం బాలికను తీసుకొని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అందుబాటులో ఉన్న వైద్యురాలు బాలికను చూసి మందుల చీటి రాసి వెళ్లిపోవాలని సూచించారు. తీవ్ర జ్వరంతో లేవలేని స్థితిలో ఉన్న తమ కుమార్తెను ఆస్పత్రిలో చేర్చుకోవాలని తల్లిదండ్రులు డాక్టర్‌ను కోరగా నిర్లక్ష్యంగా మాట్లాడుతూ సెలవు రోజున ల్యాబ్ టెక్నీషియన్స్ ఉండరు.. వైద్య పరీక్షలు చేస్తేనే తీవ్రతను బట్టి ఆస్పత్రిలో చేర్పించుకుంటామని చెప్పారన్నారు. నడువలేని స్థితిలో ఉన్న బాలికను చేర్చుకోవాలని ప్రాధేయపడినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడుతూ సీబీపీ, వైడల్ టెస్టు, డెంగీ జ్వరం టెస్టులు చేయించి రిపోర్టులు తీసుకువస్తేనే చేర్చుకుంటామని బాధితులతో సిబ్బంది వాగ్వాదానికి దిగారు. చేసేది ఏమీ లేక ఆస్పత్రికి ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌ను పిలిపించుకొని రక్త నమూనాలు ఇచ్చారు. అప్పటికి కూడా బాలికకు బెడ్ కేటాయించకపోవడంతో ఆస్పత్రి బయట కుర్చీలోనే కూర్చున్నామని తెలిపారు.

విషయం తెలుసుకున్న బాలిక బంధువులు అక్కడికి చేరుకొని వైద్య సిబ్బంది తీరుపై మండిపడ్డారు. వైద్యులు నిర్లక్ష్యం చేయడం సరికాదని, పేదలు ప్రభుత్వ ఆస్పత్రికి రాకుండా ఎక్కడికి వెళ్తారని వైద్య సిబ్బందిని నిలదీశారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై రాజమౌళి ఆధ్వర్యంలో పోలీసులు ఆస్పత్రికి చేరుకొని బాధితులు, వైద్య సిబ్బందితో చర్చించి తీవ్ర జ్వరంతో ఉన్న బాలికకు వెంటనే బెడ్ కేటాయించి చికిత్స అందించాలని సూచించారు. చివరకు వైద్య సిబ్బంది బాలికను ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యచికిత్స ప్రారంభించారు. సంబంధిత విషయమై డాక్టర్ సౌఖ్యను వివరణ కోరగా తాను రోగి కుటుంబ సభ్యుల పట్ల దురుసుగా మాట్లాడలేదని, రాత్రి 2గంటల ప్రాంతంలో వచ్చిన సమయంలో రోగిని తీసుకువచ్చిన విషయం తనకు తెలియదని, ల్యాబ్ టెక్నీషియన్స్ లేరని, రక్తపరీక్షలు చేయించాలని, పరీక్ష రిపోర్టులను బట్టి ట్రీట్‌మెంట్ ఉంటుందని చెప్పడం జరిగిందన్నారు. తాను రక్తపరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లమని చెప్పలేదని వివరించారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి బుద్ధి చెబుతాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట రజనీకాంత్


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రజనీకాంత్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 15: ఏపీ సీఎం చంద్రబాబునాయుడి పేరును ఉచ్చరించే అర్హత లేని వీధిరౌడీలా ప్రవర్తిస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట రజనీకాంత్ హెచ్చరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ గూండాలచే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు చేయిస్తున్నారని కౌశిక్‌రెడ్డి మాట్లాడడం దుర్మార్గమన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కౌశిక్‌రెడ్డి మతిభ్రమించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా రన్నారు. టీడీపీని దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ కౌశిక్‌రెడ్డిచే నీచ రాజకీయాలు చేయిస్తుందని మండిపడ్డారు. మహిళలంటే గౌరవం లేకుండా, ఎమ్మెల్యే అనే స్థాయిని మరిచిపోయి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న దుర్మార్గుడని ఆయన మండిపడ్డారు. మరోసారి టీడీపీ జోలికి వస్తే తరిమి కొట్టడం తప్పదన్నారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముంజ వెంకట్రాజం, నాయకులు మాదిరెడ్డి ధర్మారెడ్డి, బత్తిని ఎల్లయ్యగౌడ్, సీహెచ్.సోమనర్సయ్య కొట్టె దామో దర్, కొము రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన గ్రంథాలయ భవనం పైకప్పు

విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం


ధ్వంసమైన కుర్చీలు, బల్లలు


పెచ్చులూడిన పైకప్పు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 15: గ్రంథాలయ భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడడంతో తృటిలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన జనగామ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల నేపథ్యంలో ప్రతి రోజు సుమారు 50 మంది విద్యార్థులు ప్రిపేరవుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రంథాలయ భవనం పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడి పడ్డాయి. పక్కనే ఉన్న లక్ష్మీ గ ణపతి ఆలయ ప్రాంగణంలోని వినాయక మండ పం వద్ద అన్నప్రసాద వితరణ ఉండడంతో విద్యా ర్థులు అక్కడికి వెళ్లారు. ఈ సమయంలో భవనం పైకప్పు పెచ్చులూడడంతో విద్యార్థులకు ప్రాణా పాయం తప్పింది. అన్న వితరణ కోసం బయట కు వెళ్లడం, అక్కడ గంటన్నర పాటు నిరీక్షించిన సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుందని, ఊహించుకుంటేనే ఆందోళన కలిగిస్తుందని ప్రిపరేషన్ కోసం వచ్చిన విద్యార్థులు యోగిత, సంతోషిణి, కర్నాకర్, మహిపాల్ తదితరులు తెలిపారు. ఈ సంఘటనలో కుర్చీలు, బల్లలు ధ్వంసం కాగా పాఠకులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ గ్రంథాలయ భవనాన్ని 1963లో డంగు సున్నంతో నిర్మించారు. పురాతన మైన కట్టడం కావడం, నిర్మాణానికి కాలం చెల్ల డంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు పలువురు తెలిపారు. గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని పాఠకులు చేసిన విజ్ఞప్తి అటు పాలకులకు, ఇటు అధికారులకు గానీ చెవికెక్కలేదు. అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ సంఘటన నిలుస్తుండగా రేపటి భవిష్యత్తుకు అడుగులు వేస్తున్న నిరుద్యోగుల కుటుంబాలకు ఆ విఘ్నేశ్వరుడే రక్షగా నిలిచాడని భక్తులు మాదారపు రాజు, గంగాభవాణి, సిరిగిరి వినోద్, కొత్తపల్లి భిక్షపతి, నరహరి, వేదాటి వెంకట్‌రెడ్డి తెలిపారు.

విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

జనగామ కల్చరల్, సెప్టెంబరు 15: విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం జనగామ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసారపు ధర్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దామెర నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కుర్రెముల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎడబోయిన రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా గుర్రపు కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రమేష్, జె.ఆంజనేయులు, ఎం.నర్సయ్య, జె.రాజు, జి.అంజయ్య, బి.మల్లారెడ్డి, వి.స్వామి ఎన్నికయ్యారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం


ఆలయంలో హోమ పూజ జరిపిస్తున్న పూజారులు

వేంకన్న ఆలయంలో వైభవంగా హోమపూజ

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

చిలుపూర్, సెప్టెంబరు 15: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమ పూజను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ఆవరణలో చేపట్టిన హోమ పూజకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ నేతృత్వంలో పూజారులు ప్రత్యేక పూజలు చేసి మాస కల్యాణం చేపట్టారు. హోమ పూజలో కూర్చున్న కుటుంబాలకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్త సంగోజు మోహనాచారి, ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డు అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై.. ఆర్టీసీ సేవలు

- క్యూఆర్ కోడ్ ద్వారా పది యాప్‌ల వినియోగం
- కొత్తగా రూపొందించిన టీజీఎస్ఆర్టీసీ
- మరింతగా జనాల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ

జనగామ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మరింత వేగంగా, సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది. ఇప్పటి వరకు ఉన్న ఆన్‌లైన్ సేవలను ప్రయాణికులకు మరింత చేరువ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ సేవలతో పాటు సలహాలు, సూచనలు, ఫిర్యాదులు అందించేందుకు రూపొందించిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలన్నీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చింది. దీనికోసం కొత్తగా 'క్యూఆర్ కోడ్'ను రూపొందించింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఉన్న చోట నుంచే పది రకాల ఆర్టీసీ సేవలను పొందే అవకాశం ఏర్పడింది. కాగా.. దీనిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. స్కూళ్లు, కాలేజీలు, వ్యాపార సముదాయాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, జన సంచారం ఉండే ప్రధాన చౌరస్తా వంటి ప్రాంతాల్లో ఈ క్యూఆర్ కోడ్ ప్రతులను గోడలపై అంటించడంతో పాటు ఫ్లెక్సీల రూపంలో ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



ఒక్క కోడ్‌తో పది యాప్‌లు

వివిధ ప్లాట్‌ఫారాల ద్వారా అందిస్తున్న సేవలను ఆర్టీసీ ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. దీనికోసం ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌ను తయారు చేసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీ అందించే ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, బస్సుల సమాచారం తెలిపే 'గమ్యం' యాప్, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఆర్టీసీ ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ ఛానల్ వంటి పది రకాల యాప్‌లు ప్రత్యక్షం అవుతాయి. వీటిలో అవసరం ఉన్న యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి వెళ్లి సేవలను పొందేందుకు వీలుంది. దీనితో పాటు ఫేస్‌బుక్, ఎక్స్ ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ఫిర్యాదులు కూడా చేసే అవకాశం ఉంది. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా కూర్చున్న చోటు నుంచే వివిధ రకాల సేవలను బ్రౌజ్ చేసుకునే అవకాశం ఉంది.

జనాల్లో అవగాహన కోసం..

ఆర్టీసీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు జనగామ ఆర్టీసీ అధికారులు డిపో పరిధిలోకి వచ్చే మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. స్కూళ్లు, కాలేజీ, వ్యాపార సముదాయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను అంటిస్తున్నారు. వీటితో పాటు ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రజలకు అవగాహన పరుస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ఈ పది రకాల సేవలను విడివిడిగా అందిస్తుండగా జనాల్లో ఆశించినంత స్పందన కనిపించడం లేదు. వెబ్‌సైట్లను బ్రౌజ్ చేసే, ఆర్టీసీ సోషల్ మీడియా పేజీలను వీక్షించే వారి సంఖ్య అంతగా ఉండడం లేదు. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడం ద్వారా సేవలను సులభతరం చేసే వీలుంటుందని ఆర్టీసీ అధికారుల భావన. దీనికోసం జనగామ జిల్లాలో అవగాహన కార్యక్రమాలకు ఆర్టీసీ అధికారులు శ్రీకారం చుట్టారు.

ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ప్రజలకు సేవలను మరింత సులభతరం చేసేందుకు గానూ ఆర్టీసీ పది ఆన్‌లైన్ సేవలను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. దీనికోసం కొత్తగా క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. దీనిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లు, తదితర జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- స్వాతి, డిపో మేనేజర్, జనగామ


బచ్చన్నపేట మోడల్ స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

18న పెద్దల పండుగ జరుపుకోవాలి

కొత్తగూడ, సెప్టెంబరు 15 : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ప్రతీ సంవత్సరం జరుపుకునే పెద్దల పండుగను ఈనెల 18న కొత్తగూడ, గంగారం మండలాల్లోని ఆదివాసీలు నిర్వహించుకోవాలని దొరపటేళ్ల సంఘం ఉమ్మడి కొత్తగూడ మండల అధ్యక్షుడు భీరబోయిన సమ్మయ్య పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఆదివాసీలు జరుపుకుంటున్న పెద్దల పండుగను ప్రతీ సంవత్సరం ఉత్తర కార్తీలోని మొదటి పాదంలో వచ్చే మొదటి బుధవారం నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా ఆదివాసీలు సంప్రదాయకరంగా పెద్దల పండుగను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎట్టి సర్వయ్య, కోశాధికారి కల్తి వెంకటేశ్వర్లు, మల్లెల రాంబాబు, ఈక నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలి

▸▸ నర్సంపేట సివిల్ ఆస్పత్రిని నెక్కొండకు తరలించాలి ▸▸ సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ

నర్సంపేట, సెప్టెంబరు 15 : నర్సంపేట పట్టణ శివారులోని మెడికల్ కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని, నర్సంపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపారు. జిల్లా స్థాయి ఆస్పత్రి ఏర్పాటు అవు తున్నందున నర్సం పేటలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని గిరిజన ప్రాంతమైన నెక్కొండకు తరలిస్తే మండ లంలోని ప్రజలు, గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతు ందన్నారు. దుగ్గొండిలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే నర్సం పేటలో మెడికల్ కళాశాల కోసం విరాళంగా భూమిని అందించిన పారిశ్రామి కవేత్త దొడ్డ మోహన్‌రావును కళాశాల ప్రారం భోత్సవానికి ఆహ్వానించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

ఇప్పటికే రూ.100 కోట్లతో అన్ని వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం, 50 అడ్మిషన్లతో అన్ని వసతులతో కళాశాల భవన నిర్మాణం పూర్త యిందన్నారు. మెడికల్ కళాశాలలో భవిషత్‌లో 150 అడ్మిషన్లను పెంచుకునే అవకాశం ఉందన్నారు. పీజీ కళాశాల మంజూరు కావాల్సి ఉందని, నర్సింగ్ కళాశాల మంజూర యిందన్నారు. నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ సిబ్బందికి సంబంధించి రెసిడెన్సియల్ భవనాలు, రెసి డెన్సియల్ హాస్టల్ ల్యాబ్స్ ఇతర వసతు కొరకు జీవో 83 ద్వారా మరో రూ.183 కోట్లు మంజూరై ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు కాకుండా కొత్తపనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం ఉందని సీఎంకు పంపిన లేఖలో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 53 పల్లె దవాఖానాలు బీఆర్ఎస్ హయాంలో మంజూరయ్యాయని, అందులో 29 దవాఖానాలు పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను విడు దల చేయాలని సీఎంను కోరారు. జాతీయ స్థాయి విద్యా సంస్థ అయిన మెడికల్ కళాశాల భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రావటం గౌరవప్రదంగా ఉంటుందని ప్రజలు భావి స్తున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖ ప్రతులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ, రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పంపానని ఆయన పేర్కొన్నారు.

కారు డ్రైవర్ ఇంట్లో చోరీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని కారు డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.10వేల నగదు, రూ.90వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన వెల్మా రాజేందర్ కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 12న రాజేందర్ అతడి భార్య సుజాత, కూతురు హిరకలు వేములవాడ దేవస్థానానికి మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు. రాజేందర్ కుటుంబసభ్యులు తిరిగి ఈ నెల 14న రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తొలగించి ఉన్నట్లు గుర్తించి ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో దాచి పెట్టిన తులం బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు కమలు, మాటీలు, 5 బంగారు ముక్కలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడు రాజేం దర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం కానిస్టేబుల్ క్రాంతికుమార్ ఘట నాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వేసవి సెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తాం..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు వేసవిసెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ఒప్పించి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిసామనే ధీమాను వ్యక్తం చేశారు. జీవోనెం. 11, 12లను సవరించి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంల ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ టైం స్కేలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్టీయూ ముందుంటుందన్నారు. అన్ని యాజమాన్య గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను త్వరలోనే పరిష్కరింప జేస్తామన్నారు. అనంతరం హనుమకొండ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.కోమల్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా వి.వాణి, ఉపాధ్యక్షులుగా ఎ.మహిపాల్‌రెడ్డి, వి.రామాంజనేయులు, కె.రాజేం దర్‌రెడ్డి, జి.విష్ణుమూర్తి, ఎం.సురేందర్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.సరస్వతి, కార్యదర్శులుగా బి.మురళీధర్, బి.శరత్‌గౌడ్, ఎల్.గణపతినాయక్, కె.రమేష్‌బాబు, మహిళా కార్యదర్శిగా నికత్ సుల్తానాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు సాధించిన గౌరిశెట్టి రాజన్న, జిల్లా స్థాయిలో సత్కారం పొందిన అనురాధను సత్కరించారు. సంఘ నాయకులు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, పట్టాభి, సుమ, అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


విజయ్ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 15 : కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన రైల్వే ట్రాక్‌మెంటెనర్ కాడబోయిన విజయ్ (35) గుండెజబ్బుతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఈనెల 12న ఇంటి వద్ద క్రిమిసంహారకమందు తాగగా కుటుంబసభ్యులు ఆయన్ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య మణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. విజయ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. మన్నెగూడెంకు చెందిన పాతలోతు వినేష్ (23)కు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన కరుణశ్రీతో ఐదునెలల క్రితం వివాహం జరిగింది. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంలో ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న దంపతులిద్దరూ బర్లగూడెంలోని కరుణశ్రీ తల్లిగారింటికి వెళ్లారు. అక్కడ్నుంచి వినేష్ ఒక్కడు మాత్రమే మన్నెగూడెంలోని ఇంటికి వచ్చాడు. వినేష్ తండ్రి బాలు అనారోగ్యంతో ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చిని శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చారు. ఆమె తలుపులు కొట్టగా ఎవరూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె కిటికీలో నుంచి చూడగా వినేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వినేష్ తండ్రికి సమాచారం అందించారు. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంకు చెరుకుని విగతజీవిగా ఉన్న కొడుకును చూపి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కొడుకు మృతిపై తనకు అనుమానం ఉందని వినేష్ తండ్రి బాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెగడపల్లికి చెందిన దామెర ఎల్లయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రావణ్‌కుమార్ (23) ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. 15న ఉదయం వంగపహాడ్-ఆరెపల్లి ఔటర్‌రింగ్‌రోడ్ మధ్యలో రోడ్డుప్రమాదంలో చనిపోయినట్లు ఫోన్ సమాచారం రావడంతో వెళ్లి చూసేసరికి ద్విచక్రవాహనం రోడ్డు ప్రక్కనే విద్యుత్ స్తంభానికి ఢీకొని శ్రావణ్‌కుమార్ చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 15: పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓవ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. కాజీపేట ఎస్సై వి.లవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే ఆస్పత్రి వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 860 గ్రాముల గంజాయి లభ్యమైంది. కాజీపేటకు చెందిన గొర్రె సారంగపాణి ఇరవై రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లి వ్యాపారం చేసేందుకు గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 21,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

చెరువుల రక్షణకు వాడ్రాను ఏర్పాటు చేయాలి

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

సుబేదారి, సెప్టెంబరు 15: వరంగల్ ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల పరిరక్షణ కోసం వాడ్రాను ఏర్పాటు చేసి, వాటిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హను మకొండ అదాలత్ జంక్షన్‌లోని అమర వీరులస్థూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజాసంఘాల నేతలు డాక్టర్ తిరునహరి శేషు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, సాయిని నరేందర్, డాక్టర్ చింతం ప్రవీణ్ లు మాట్లాడారు. భద్రకాళి, వడ్డెపల్లి చెరువులలో కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని అన్నారు. వరంగల్ జిల్లాను కబ్జాదారుల నుంచి కాపాడాలని, కబ్జాలకు సహకరించిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోండ్ర నర్సింగరావు, డాక్టర్ వెంగళ్‌రెడ్డి, తాడిశెట్టి క్రాంతి కుమార్, గాజాల గోవర్ధన్, మల్యాల కృష్ణ, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, ఊ నర్సయ్య, సాదు కుమారస్వామి, కృష్ణస్వామి, పరశురాములు, వస్కుల రవీందర్, ఎబ్నైజర్, అంకేశ్వరపు రాంచదర్, కన్నాల రవి పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మడికొండ, సెప్టెంబరు 15: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బోగి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మడికొండలో నిర్వహించిన వాల్మీకి బోయ బోగి లింగమూర్తి అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వల్మీకి బోయ వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు నిగ్గుల వెంకటప్రసాద్, ముచ్చు రాజ్‌కుమార్, దేశెట్టి గోపాల్, వెంకటేష్, బోగి కుమారస్వామి, పెనుకుల సారయ్య, తట్ల రమేష్, బేర్గు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోగి కృష్ణమూర్తి

రావయ్యా.. గణపయ్యా..

- నిమజ్జన వేళ గణపతులకు అపూర్వ స్వాగతం
- నగరంలో మూడు చోట్ల ప్రత్యేక వేదికలు
- విశ్వహిందూ పరిషత్ నేతల వెల్లడి
- ఉత్తమ గణపతులకు బహుమతులు



అత్యుత్తమ బహుమతిని అందుకుంటున్న కాజీపేటలోని టీఎన్జీవోస్ గజానన మండలి నిర్వాహకులు, ద్వితీయ బహుమతి అందుకుంటున్న శ్రీజ హోమ్ బాధ్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలను అపూర్వంగా స్వాగతించేందుకు ఎప్పటిలాగే మూడు ప్రాంతాల్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ వరంగల్ మహానగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. యేటా నిర్వహించే ఉత్తమ గణపతులకు బహుమతుల ప్రదానోత్సవం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం జరిగింది.

శ్రీ చైతన్యానంద మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ గణేష్ మండళ్ల నిర్వాహకులకు జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాలకొండ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కాజీపేట నుంచి తరలివచ్చే వినాయక విగ్రహాలను నిట్ సమీపంలో.. హనుమకొండ ప్రాంతం నుంచి తరలివచ్చే గణేష్ నిమజ్జన రథాలను హనుమకొండ చౌరస్తాలో.. వరంగల్ ప్రాంత విగ్రహాలకు పోచమ్మమైదాన్ సెంటర్‌లో ప్రత్యేక వేదికలను ఏర్పాట్లు చేసి ఆయా గణేష్ మండళ్ల తొమ్మిదిరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ అపూర్వంగా స్వాగతించనున్నట్లు వివరించారు.

ఈసారి ఉత్సవాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో మట్టి గణపతులను మండపాలలో నెలకొల్పి పూజలు నిర్వహించి పర్యావరణానికి సహక రించారని తెలిపారు. ఉత్తమ గణేష్‌ల ఎంపిక కోసం ఏడు విభాగాలుగా ఎంపికచేసిన 150 మంది కార్యకర్తలు తమకు సహకరించినట్లు భాస్క ర్‌రావు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్తమ గణపతి మండళ్లు ఇవే..

వరంగల్ మహానగర పరిధిలోని అన్ని విగ్రహాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఉత్తమ గణపతులను ఎంపిక నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈసారి మహానగర పరిధిలో కాజీపేట బాపూజీనగర్ ప్రాంతంలో టీఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ గజానన మండలి మండలిని అత్యుత్తమ గణపతి మండలిగా ఎంపిక చేశారు. అదే విధంగా హమారా హిం దుస్థాన్ పేరిట కాజీపేట బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణప య్యకు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. వీటితోపాటు వరంగల్ ఎల్లం బజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ సమితి, కాశిబుగ్గ ఓసిటీ గజా ణన మండలి, ఖిలావరంగల్ వినాయక ట్రస్టు భవన్ వాసవీ లైన్, హనుమకొండలోని నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండలి, అలాగే హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీగ జాణన మండలి, కేయూ పరిధిలో విజయగణపతి కాలనీలో విజయగణపతి మందిరంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి అత్యుత్తమ మండలులుగా ఏర్పాటు చేసి బహుమతులను ప్రదానం చేశారు. కాగా, ప్రథమ బహుమతులుగా వరంగల్ గీతాభవన్‌లోని సిద్ధి విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ, కాశిబుగ్గలోని రాంకీ విల్లాలో ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ, ఖిలా వరంగల్‌లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండలి, హనుమకొండ జులైవాడలో శివపార్వతి గజానన మండలి, జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్‌లో విజయగణపతి నవరాత్రి సమితి, కాజీపేట డీజిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి యూత్ అసోసి యేషన్ ద్వితీయ బహుమతులుగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని 14 గణేష్ మండళ్లకు అందించగా, తృతీయ బహుమతులుగా 22 గణేష్ మండళ్లను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి సురేఖ


టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకం

పవిత్ర హృదయంతో కూడిన ప్రతీ మనిషికి యావత్తు భూమి ప్రార్థనా స్థలమేనని మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ (సోమవారం)ను పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, సర్వమానవ సమానం అనే సుగుణాలు మనిషిని ఉత్తమ మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదు..


సమావేశంలో మాట్లాడుతున్న మన్నె చంద్రయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య హెచ్చరించారు. ఆదివారం కాళోజీ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ఎన్నికల్లో ఓడిన ఓ వ్యక్తి సంఘంలో చీలికలు తెచ్చి సంఘం నాది అనే ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులను మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ తమకు అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని ప్రగల్భాలు పలుకుతున్న వారు వారి పద్ధతిని మార్చుకోవాలన్నారు. పోలీసుల కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తే ఎవరు భయపడరన్నారు. సంఘం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మాత్రమే పదేళ్లుగా పాటుపడుతున్నామని, రాజకీయాలు చేసేందుకు ఉపాధ్యాయ సంఘంలో పనిచేయడంలేదన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చెన్నయ్య, అబ్దుల్ పనిచేస్తున్నారని, ఆ సంఘంలోనే తాము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రమేష్, సంతోష్, రాజు, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ కామన్ మెస్‌లో అగ్ని ప్రమాదం


ప్రమాదంతో దగ్ధమైన వంటసామాగ్రి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్‌లో ఆదివారం ఉదయం వంటలు చేస్తుండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలతో ఒక్కసారిగా కామన్ మెస్ సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలకు గురయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో కామన్ మెస్ సిబ్బంది వంట చేస్తుండగా నూనె భారీ గిన్నెలో సలసల కాగడంతో వేడికి ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటల్లో కామన్ మెస్‌కు సరఫరా అయ్యే విద్యుత్ వైర్ కాలి బూడిదైయింది. వంట పాత్రలు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని విద్యార్థులు, సిబ్బంది చెప్పారు. ఒకవేళ విద్యుత్ వైర్లు నీళ్లలో పడిఉంటే కామన్ మెస్ భవనానికి షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డికి ప్రమాద విషయాన్ని వివరించి విద్యుత్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. వర్సిటీ విద్యుత్ సిబ్బంది కామన్‌మెస్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం లంచ్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు చేపట్టారు. వర్సిటీ ఇంజనీరింగ్ శివశంకర్, హాస్టల్స్ కేర్ టేకర్ ప్రభాకర్, రాజు తదితరులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. భారీ ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వర్సిటీ కాంట్రాక్టు

అధ్యాపకులు బెదిరిస్తున్నారు..

సోషల్ మీడియాలో ఓ దళిత మహిళ ప్రొఫెసర్ ఆవేదన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు తన విధులకు ఆటంకం కలిగిస్తూ, అవమాన పరుస్తున్నారని కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ప్రొఫెసర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సదరు మహిళ ప్రొఫెసర్.. ఆదివారం సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తపరిచారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి.. వర్సిటీ క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ చేయాలంటూ ఐదు నెలలుగా తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి ఆయన.. తన చాంబర్ తలుపులను కోపంతో తోసుకుంటూ వచ్చి తీవ్ర పదజాలంతో మాట్లాడి తన విధులకు ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాంట్రాక్టు అధ్యాపకుడైన తనను కాదని, మరో పార్టుటైమ్ అధ్యాపకురాలిని డిపార్టుమెంట్‌కు ఎలా బదిలీపై రప్పిస్తావని ప్రశ్నించారని తెలిపింది. మీకు తెలుగు విభాగాధిపతిగా పనిచేయడం చేతకాదని, రాజీనామా చేయలంటూ మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలు, వర్సిటీ నిబంధనల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నానని చెప్పినప్పటికీ వర్సిటీలో కాంట్రాక్టు సంఘం అధ్యక్షుడు, ఇతర కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి తనను ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి, సెప్టెంబరు 15: మిషన్ భగీరథ నీటి నాణ్యత, పరిశీలన, పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ముఖ్య సలహాదారు కె.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అచ్చ రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పులి రాజేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కె.విద్యావతి, జిల్లా కోశాధికారులుగా జి.సూరజ్, ఎస్.భాగ్య లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా యు.కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అశోక్, రాధిక, భరత్, యాకయ్య, రాజు, పరశురాములు ఎన్నికయ్యారు.

రేపు ఏనుమాముల మార్కెట్‌లో

యథావిధిగా క్రయవిక్రయాలు

మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సోమవారం వినాయక నిమజ్జనం, మంగళవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెల వుగా ప్రకటించడం జరిగింది. కాగా ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్ మం గళవారం యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు తమ సరుకులను విక్రయించడానికి అవకాశం ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

పశుగణనకు సిద్ధం

- భారత్ పశుగణ యాప్ అందుబాటులోకి రాగానే మొదలు
- సిబ్బందికి శిక్షణ పూర్తి



హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :ఐదేళ్లకోసారి జరిగే జాతీయ పశుగణన చేపట్టేం దుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పశు సంవర్ధక శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. వాస్తవంగా ఈ గణన ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే పశు గణ్ పేరుతో కేంద్రం ఒక యాప్‌ను రూపొందిస్తోంది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. యాప్ అందుబాటులోకి రాగానే పశుగణన మొదలవుతుంది. నాలుగు నెలల పాటు ఈ గణన సాగుతుంది. పశుగణన ఐదేళ్లకోసారి దేశ వ్యాప్తంగా జరుగుతుంది. ఈ గణనలో భాగంగా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కుందేళ్లు, కోళ్ల తదితర లైవ్‌స్టాక్‌ను లెక్కిస్తారు. 2018లో 20వ పశుగణన నిర్వహించారు. 2023లో 21వ గణన జరపాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో ఆలస్యమైంది.

ఈ గణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా అవులు, గేదెలు,, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతోపాటు కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనే ది కూడా తెలుస్తుంది. మొత్తం మీద గతంతో పోల్చితే పశువుల సంఖ్య ఏ మేర పెరిగింది అనేది స్పష్టమవుతుంది. 2018లో నిర్వహించిన పశు గణన ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 47.04 లక్షల లైవ్ స్టాక్, 61.30 లక్షల కోళ్లు ఉన్నాయి. ఈ సారి ఇవి ఏ మేరకు పెరిగింది? లేదా తగ్గింది.. తాజా పశుగణన ద్వారా తేటతెల్లమవుతుంది. ఉమ్మడి జిల్లాలో పదేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. పశువుల గణన సరైన ప్రణాళిక, పశుసంక్షేమ ప్రణాళిక రూపకల్పనకు ఎంతో దోహదపడుతుంది, ఈ రంగంలో వినూత్న కార్య క్రమాలను అమలుచేయడానికి పశుగణన సమాచారం ఎంతో దోహదపడుతుంది.

తగ్గుతున్న కుందేళ్లు

2018 గణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో కుందేళ్లు పదివేలకు మించి లేవు. కుందేళ్లను వేటాడడం, వాటి పెంపకాన్ని పెద్దగా చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల వాటి సంఖ్య ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పందుల సంఖ్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. వ్యాధులకు కారణమవుతున్న పందుల పెంపకాన్ని ప్రభుత్వం ఏ మాత్రం ప్రోత్సహించడం లేదు. సీమ పందుల పెంపకం మాత్రం కొంత మేరకు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గాడిదల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపో యింది. ఇప్పుడు ఎక్కడా గాడిదలు కనిపించడం లేదు. గతంలో రజకులు గాడిదలను పెంచి పోషించేవారు. బట్టలను ఉతికేందుకు చాకిరేవుల వరకు బట్టల మూటలను తీసుకువెళ్లేందుకు వాటిని ఉపయోగించేవారు. ఇప్పుడు చాకి రేవులు తగ్గిపోయాయి. దానితో గాడిదల పోషణ కూడా తగ్గింది.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

ఉమ్మడి జిల్లాలో పశుగణన నిర్వమించేందుకు 180మంది పశు వైద్యులను పర్యవేక్షకులుగా, 101 మంది పశు సంవర్ధక శాఖకు చెందిన వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఉంటారు. ప్రతీ 1500 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయిస్తారు. పశు జాతులను ఎలా గుర్తించాలి, యాప్‌ను ఎలా వినియోగించాలి, సేకరించిన సమాచారాన్ని ఎలా అప్‌లోడ్ చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గణన చేపట్టేవారు మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించి న వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో మ్యానువల్ పద్ధతిలో గణన జరగగా దేశంలో మొదటిసారిగా డిజిటల్ పశుగణనను చేపడుతున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఆవులు, గేదెలు, కోళ్ల, మేకలు, గొర్రెలు, కుక్కలు, ఇతర పశవుల వివరాలను రైతులు, పశు పోషకులను ఆడిగి నమోదు చేసుకుంటారు. రైతుల వద్ద వ్యవసాయ పరికరాలు ఎన్ని, ఏవేవి ఉన్నాయనేది కూడా నమోదు చేస్తారు. ఈ సారి ప్రత్యేక యాప్‌ద్వారా పశుగణన నిర్వహిస్తున్న క్రమంలో ప్రతీ పశువుకు ఒక డిజిటల్ నెంబర్‌ను ఇచ్చి అందులో యజమానితో పాటు పశువు వివరాలను పొందుపరుస్తారు. పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా వెంటనే వివరాలు తెలిసే విధంగా సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అడవుల్లో జీవించే వన్యప్రాణుల గణనను అటవీ శాఖ అధికారులు పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో పశు సంపద

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018లో నిర్వహిం చిన జాతీయ పశుగణన ప్రకారం పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు కుక్కలు కలుపుకొని మొత్తం 47.04 లక్షల లైవ్‌స్టాక్ ఉం ది. కోళ్లు 61.30 లక్షలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం లైవ్‌స్టాక్ 10.56 లక్షలు ఉంది. ఇందులో 81వేలు పశువులు, 1.11 లక్షలు గేదెలు, 6.12 లక్షలు గొర్రెలు, 97వేలు గొర్రెలు, 8వేల పందులు, ఉన్నాయి. కాగా 3వేల కుక్కలు, 19.17 లక్షల కోళ్లు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 5.56 లక్షల పశు సంపద ఉంది. ఇందు లో 49వేల పశువులు, 76వేల గేదెలు, 5.08 లక్షల గొర్రెలు, 62వేల, మేకలు, 9వేల పందులు, ఉన్నాయి. కాగా 7వేల పందులు, 21.68 లక్షల కోళ్ళు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో మొత్తం పశు సంపద 5.06 లక్షలు. ఇందు లో 69వేల పశువులు, 63వేల గేదెలు, 2.92 లక్షల గొర్రెలు, 81వేల మేకలు, వెయ్యి పందులు ఉన్నాయి. కాగా కుక్కలు 2వేలు, కోళ్ళు 4.22 లక్షలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 11.75 లక్షల పశు సంపద ఉంది. ఇం దులో 1.82 లక్షల పశువులు, 1.30 లక్షల గేదెలు, 6.78 లక్షల గొర్రెలు, 1.78 లక్షల మేకలు, 8 వేల పందులుఉండగా, కుక్కలు 11వేలు, కోళ్లు 11.09 లక్షలు ఉన్నాయి. ఉన్నాయి. ములుగు జిల్లాలో మొత్తం 3.65 లక్షల పశు సంపద ఉంది. వీటిలో 99వేల పశువులు, 61వేలే గేదెలు, 1.29 లక్షల గొర్రెలు, 75వేల మేకలు ఉండగా 4వేల కుక్కలు, 5.14 లక్షల కోళ్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 10.46 లక్షల లైవ్‌స్టాక్ ఉంది. ఇందులో 1.02 లక్షల పశువులు, 1.20 లక్షల గేదెలు, 8.01 లక్షల గొర్రెలు, 1.83 లక్షల మేకలు, 3వేల పందులు ఉండగా కుక్కలు 2వేలు, కోళ్ల 7.25 లక్షల కోళ్లు ఉన్నాయి.

కాంగ్రెస్‌లో చేరిన దేవస్థానం మాజీ చైర్మన్


ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వెంకటేశ్వర్లు

పాలకుర్తి, సెప్టెంబరు 15: పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మూల వెంకటేశ్వర్లు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కొత్తపాత తేడా లేకుండా అందరిని కాపాడుకుంటామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసేలా ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు యాకాంతరావు, పాము ఆంజనేయులు, అంజీరావు పాల్గొన్నారు.

నెల్లుట్లలో వైభవంగా లక్ష్మీగణపతి యాగం

▸▸ భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు


నెల్లుట్లలో యాగం నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి

లింగాలఘణపురం, సెప్టెంబరు 15: మండలంలోని నెల్లుట్ల గ్రామంలో ఆదివారం గణేశ్ నవరాత్రోత్సవ వేడుకల సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా లక్ష్మీగణపతి యాగాన్ని వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుడు దత్తు శర్మ ఉదయం నుంచే గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతిని నిర్వహించారు. రాత్రి 10గంటల వరకు మహిళా భక్తులు కుంకుమార్చనలను నిర్వహించారు. స్థానిక భక్తులు వందలాది మంది మహా లక్ష్మీగణపతి యాగంలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణార్థం మహా లక్ష్మీగణపతి యాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలతో పాటు లింగాలఘణపురం మండల ప్రజలు, నెల్లుట్ల వాసులు ఆయురారోగ్యాలతో, ఐష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, పాడి పంటలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 15: జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 16న వినాయక నిమజ్జనం నిర్వహించనుండగా మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీనగర్ కాలనీ, బృందావన్ కాలనీతో సహా మండలంలోని చీటకోడూరు తదితర గ్రామాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైరగోని రఘుగౌడ్, గుజ్జుల నారాయణ, చంద్రరుషి, రాంకిషన్‌రావు, రాంచందర్‌రావు, కొంద సుధాకర్, సతీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, 18వ వార్డు వాసవి కాలనీ ఫేజ్-2లో జరిగిన గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, అనిత, బండ యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి: మండల కేంద్రంలోని గుడివాడ, రాజీవ్ చౌరస్తా గణేష్ మండపాల్లో ఆదివారం జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను దర్శకత్వం వహించే సినిమాను పాలకుర్తి ప్రాంతంలో లొకేషన్లు చేసేందుకు పాలకుర్తి, వల్మిడి గ్రామాలను పరిశీలించామన్నారు. త్వరలోనే సినిమా షూటింగ్ మొదలు పెడుతామన్నారు. పాలకుర్తి ప్రాంతం సినిమా షూటింగ్‌లకు అనువైనదిగా ఉందన్నారు. మేడారపు సుధాకర్, తాళ్లరామకృష్ణ, గంగు రఘుశర్మ, మహేందర్, భాస్కర్, సోమేశ్వర్, సునిల్ ఉన్నారు.

కుంకుమ పూజలు.. అన్నప్రసాద వితరణలు


జనగామలోని వాసవి కాలనీలో స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పల్లా

● రఘునాథపల్లి: మండల కేంద్రంలోని వినాయక మండపాల వద్ద విఘ్నేశ్వరుడికి కుంకుమ, లక్ష గరికలతో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అలాగే పలు వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, బాషుమియా, లక్ష్మీనారాయణ, సంతోష్, విజయ్, సతీష్, అశోక్, అనిల్, రఘుచారి, ప్రశాంత్, సంజయ్, రాజేష్, లక్ష్మణ్, నాగరాజు, సాయి, రాజ్‌కుమార్, నవీన్, ఉస్మాన్, యాకచారి తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల: గణేష్ నవరాత్రుల్లో భాగంగా మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన నవయువత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వి.రేణుక, వి.వేణు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. 9వ రోజు సందర్భంగా నిమజ్జనం రోజున బొజ్జగణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని దాతలు కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉట్టికొట్టి నిమజ్జన ర్యాలీల ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: పలు వినాయక మండపాల నిర్వాహకులు నిమజ్జనోత్సవం రోజున మండపాల ఎదుట ఉట్టికొట్టే సంప్రదాయాన్ని గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు. శివునిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వీధిలోని వినాయక మండపం ఎదుట నిర్వాహకులు ఆదివారం ఘనంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ ఉమ్మడి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు శెనబోయిన నాగేష్‌కళ్యాణి ప్రారంభించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్ర ప్రారంభించారు. డివిజన్ కేంద్రంలోని కురుమవాడలో జై గణేష్ కురుమ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రేషన్ డీలర్ల సంఘం జిల్లా బాధ్యుడు గట్టు మోగిళి-రేణుక దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాలనీలోని వినాయక మండపం వద్ద జరిగిన మహా అన్నదాన కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, నాయకులు తాళ్లపల్లి సత్యం, గన్ను శ్రీనివాస్, భాస్కర్, సురేష్, రంగు యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తిలో పూజలు చేస్తున్న జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ


ఘన్‌పూర్ కురుమవాడలో వినాయక మండపం వద్ద అన్నదానం


రఘునాథపల్లిలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

▸▸ జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్

చిలుపూర్, సెప్టెంబరు 15: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టనున్న నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అందుకోసం స్థానిక పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచించారు. ఈ మేరకు ఆదివారం తెల్లవారుజామున మండలంలోని చిన్నపెండ్యాల గ్రామాన్ని సందర్శించారు. వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. నిమజ్జనంకోసం ఆయా గ్రామాల్లో ఉన్న చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు డీసీపీని శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా చిలుపూర్ మండలకేంద్రంలోని బృందావన కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కేజీకేఎస్ మండలాధ్యక్షుడు గనగోని రమేష్ నేతృత్వంలో 30 కుటుంబాలతో హోమపూజ చేపట్టారు. కార్యక్రమంలో నారగోని వెంకన్న, గనగోని నవీన్, మహేశ్, రాజేంద్రప్రసాద్, గొల్లపల్లి విద్యాసాగర్, నారగోని కిషన్, గనగోని వసంత, సరోజన, హేమలత తదితరులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి: గణేష్ శోభాయాత్రను భక్తులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్ఐ డి.నరేష్ సూచించారు. రఘునాథపలి మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ శోభాయాత్రలో డీజేలను ఉపయోగించకూడదని, విద్యుత్ తీగలను, వచ్చిపోయే వాహనాలను గమనించుకుంటూ యాత్రను నిర్వహించాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పాటలను గాని ప్రదర్శించకూడదని, బాణాసంచా కాల్చవద్దని తెలిపారు. ఆయా నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో నీటి వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని, చిన్న పిల్లలను రానివ్వకూడదని మండపాల నిర్వాహకులకు సూచించారు.


చిన్నపెండ్యాలలో వినాయక మండపం వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దేవరుప్పుల, సెప్టెంబరు 15: మండలంలోని పెద్దమడూరు గ్రామానికి చెందిన చెరుకు నర్సింహులు అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసినట్టు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. నర్సింహులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రఘునాథపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ఫతేషాపూర్ గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని రూ.750 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. దాడిలో ఏఎస్ఐ బి.కట్టమల్లు, కానిస్టేబుల్ కె.కుమారస్వామి పాల్గొన్నారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

కాంగ్రెస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ


పట్టణంలో అన్వర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 15: కాంగ్రెస్ నేతను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేసుకున్న జనగామ పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ.అన్వర్‌ను ఆదివారం ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్‌రావు అనారోగ్యంతో ఉండడంతో ఆయన నివాసంలో కలుసుకున్న ఎమ్మెల్యే ధైర్యంగా ఉండాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, 29వ వార్డు కౌన్సిలర్ దయాకర్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు మసీబుర్ రెహమాన్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

▸▸ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 15 : నేటి సమాజంలో క్రీడలకు చాలా ప్రాధాన్యత పెరిగిందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ మీట్-2024ను నిర్వహించగా ఝాన్సీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలను మనం చూస్తున్నామని, పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైమరీ దశలోనే ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. బాలయేసు పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు, ఎన్‌సీసీ శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు ధర్మారెడ్డి, ఓడపెల్లి రవీందర్, కాడబోయిన గణేష్, ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.


బాలయేసు హైస్కూల్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ఝాన్సీరెడ్డి

బాలికల గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక


ఉపేందర్

పాలకుర్తి, సెప్టెంబరు 15: దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన జెర్రిపోతుల ఉపేందర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల పేరెంట్స్ కమిటీ నూతన చైర్మన్‌గా ఆదివారం ఎన్నికయ్యారు. పాలకుర్తి మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా పసలాది ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బండిపెల్లి మనోహర్, సహాయ కార్యదర్శిగా గాయాల యాకయ్య, కోశాధికారిగా తాళ్లపల్లి యాకయ్య, సభ్యులుగా రవితేజ, నాగన్న, ముఖ్య సలహాదారుగా ఎస్.యాకన్న ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

బచ్చన్నపేట, సెప్టెంబరు 15: మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో గుండెపోటుకు గురై అటెండర్ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకాయల బాలయ్య(48) అనే వ్యక్తి చిల్పూర్ మండలం లింగంపల్లిలోని పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామంలోని వెంకటేశ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. బాలయ్య గతంలో వీఆర్ఏగా పనిచేయడంతో మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఆయనకు భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమార్తెలున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, కాంగ్రెస్ నాయకులు జంగిటి విద్యానాథ్ తదితరులు కోరారు.

ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంథాలు ఉండాలి


తమ్మడపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బచ్చన్నపేట, సెప్టెంబరు 15: ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంథాలు ఉండాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలోని భగవద్గీత జ్ఞాన ధర్మ ప్రచార కమిటీ ప్రతినిధులు ఉద్బోధించారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలో తెలిపిన ప్రతి ధర్మాన్ని నిజ జీవితంలో పాటించాలని అన్నారు. కార్యక్రమంలో దేవేంద్ర, పంచాక్షరి, ఉపేంద్ర, యాదగిరి, రామరాజు, లక్ష్మీనారాయణ, శివరామకృష్ణ, అశోక్, సాయిరాజు, కోటి, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ కళాకారిణి హఠాన్మరణం


రాములమ్మ (ఫైల్)

లింగాలఘనపురం, సెప్టెంబరు 15: లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన రాష్ట్ర స్థాయి ఉత్తమ బోనాల కోలాటం అవార్డు గ్రహీత బండి రాములమ్మ(55) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బోనాల కోలాట కళాకారిణిగా అవార్డు అందుకున్న రాములమ్మ గత కొద్ది రోజులుగా హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాములమ్మ మృతితో నెల్లుట్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాములమ్మ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బోనాల కోలాటం కళారంగంలో వేలాది మంది మహిళా కళాకారులను తయారు చేసి గుర్తింపు పొందింది. దీంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో తన కళను అద్భుతంగా ప్రదర్శించి అప్పటి గవర్నర్ తమిళిసై ఉత్తమ మహిళ అవార్డును అందజేశారు.

రాములమ్మ మృతి పట్ల తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరక్టర్ మామిడి హరికృష్ణ సంతాపం తెలిపారు. బోనాల కోలాటం కళారంగానికి దేశవ్యాప్తంగా వన్నె తెచ్చి ఢిల్లీ ఎర్రకోటలో మహామహుల నుంచి అభినందనలు అందుకున్న కళాకారిణిని కోల్పోవడం బాధాకరం అన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు సర్కారు అండ

▸▸ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా పని చేస్తోందని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచాలని కోరినట్లు తెలిపారు. సెప్టెంబరు 13న కేంద్ర ప్రభుత్వం ముడి పామ్‌ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. రైతులు వరికి బదులు పామాయిల్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జంగా రాఘవరెడ్డి కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


చెన్నూరులో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి, సెప్టెంబరు 15: మండలంలోని చెన్నూరు జడ్పీఉన్నత పాఠశాలలో 2007-08లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు చదువుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులు పోతుగంటి నర్సయ్య ఎస్.యాకయ్య, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, విద్యాదేవి, జానకి, శోభ, ఊర్మిళను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ, మధు, పాషా, సద్దాం, భాస్కర్, చంద్ర, ప్రవీన్, అనిల్, మధు, శ్రీనివాస్, మంజుల, కవిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఫతేషాపూర్ చెరువు నిర్మాణం అద్భుతం

▸▸ చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ఫతేషాపూర్ చెరువు నిర్మాణం ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా అద్భుతంగా నిలుస్తుందని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఇంజనీర్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఫతేషాపూర్ చెరువును రత్నాకర్‌రెడ్డి ఆదివారం సందర్శించి చెరువు నిర్మాణాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువును నిర్మించిన స్థలం, నిర్మాణ నైపుణ్యం ఆనాటి ఇంజనీర్ల ప్రతిభను తెలియజేస్తుందన్నారు. నాలుగు శతాబ్దాల క్రితం నిర్మించిన చెరువు పైభాగంలో సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరిగడి గుట్టల నుంచి వర్షపు నీరు చెరువులోకి వచ్చేటట్లు నిర్మించారని తెలిపారు. చెరువుకు ఉన్న రెండు తూములలో పెద్ద తూము నిర్మాణం ప్రత్యేకంగా కనిపిస్తుందని, చెరువు లోపలి వైపు రాతి పలకలతో ఒక కమాన్ మాదిరిగా నిర్మించారని, దానిపై ఒక పూల మొగ్గ, రెండు వైపులా ఉబ్బెత్తు చక్రాల వంటి శిల్పం కనిపిస్తుండడం విశేషమని అన్నారు. చెరువు బయటి వైపు తూము నుంచి బయటకు వచ్చే నీటిని చతురస్రాకారపు పంపు హౌస్‌లో నుంచి బయటకు వచ్చేలా నిర్మించారని తెలిపారు. ఈ హౌస్ ఒక మీటరు వెడల్పు, రెండు మీటర్ల పొడవుతో బలమైన రాతి పలకలతో నిర్మించడం వల్ల తూము నుంచి బయటకు వచ్చే నీరు ఒత్తిడితో వేగంగా బయటకు తన్నుకొని వస్తుందని, ఒత్తిడిని తట్టుకునేందుకు చెరువు బయట నిర్మించిన హౌస్‌కు ఉపయోగించిన రాతి పలకలను జిగురు వంటి పదార్థంతో అతికించారని వివరించారు. ఇంజనీరింగ్ నైపుణ్యంను ప్రత్యక్షంగా తిలకించడానికి విహార యాత్రలో భాగంగా విద్యార్థులను తీసుకెళ్లాలని రత్నాకర్ రెడ్డి సూచించారు.


ఫతేషాపూర్ చెరువు తూము నిర్మాణంను చూపిస్తున్న రత్నాకర్‌రెడ్డి

ఎర్ర జెండాలు ఏకం కావాలి : ఎంసీపీఐ(యూ)


పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

పాలకుర్తి, సెప్టెంబరు 15: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎర్ర జెండాలు ఏకం కావాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి పిలుపునిచ్చారు. పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఆదివారం వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులు చేసిన త్యాగాలు గొప్పవని అన్నారు. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడానికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల వల్లనేనని అన్నారు. వెట్టిచాకిరి విముక్తి అనేక మంది పోరాటాల త్యాగాల ఫలితమేనని తెలిపారు. అందుకోసం దేశంలో మనువాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఏకం కావాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు అరున్, వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి, కనకం సంధ్య, బత్తిని కుమారస్వామి, ఉడుత గణేష్, ప్రశాంత, అశోక్, రాజు, ఎండీ.ఖాజర్ బాషా, సాంబరాజు పాల్గొన్నారు.